వీరు మారరంతే..

రాజధాని ప్రాంతంలోని నగరం గుంటూరు. జిల్లాకు గుండెకాయలాంటిది. చైతన్యమైన ప్రాంతంగా గుర్తింపు. జిల్లా స్థాయి అధికారులు ఇక్కడే ఉంటారు. వైద్య, విద్యా, వ్యాపార పరంగా ప్రసిద్ధి. ప్రతిరోజు లక్షలాది మంది నగరానికి వచ్చిపోతుంటారు. ఏ చిన్న పాటి సమస్య వచ్చినా ప్రభుత్వంపై ప్రభావం ఉంటుంది. ప్రభుత్వం ఏరికోరి అధికారుల నియామకాలు చేపడుతుంటారు. ప్రస్తుతం నగర కమిషనర్ నగర అభివృద్ధిపై దృష్టి పెట్టారు. ఉదయం నుంచి రాత్రి వరకు నగరాన్ని చుట్టేస్తున్నారు. పాలన సంస్కరణలకు ప్రయత్నిస్తున్నారు. కానీ ఆచరణలో ఫలితం అంతంతమాత్రంగానే ఉంది.


మార్కెట్లో అధ్వానంగా పారిశుద్ధ్యం

కమిషనర్ ఆదేశాలు బేఖాతర్

- వర్క్ ఇన్‌స్పెక్టర్లు, వాల్వ్ ఆపరేటర్లకు బదిలీల్లేవ్
- పారిశుద్ధ్య కార్మికుల రేషనలైజేషన్ ప్రక్రియకు అడ్డంకులు
- ఏఈ సస్పెన్షన్‌కు సిఫార్సు చేసినా.. స్పందన కరువు
- తూతూమంత్రంగా స్పెషల్ శానిటేషన్
- పైప్‌లైన్‌కు తరుచూ మరమ్మతులు
- పట్టీపట్టనట్లు ఉంటున్న కిందస్థాయి అధికారులు

నెహ్రూనగర్: ఉద్యోగులు ఎప్పటినుంచో ఇక్కడే తిష్టవేశారు. వీరిని కదిలించేందుకు కమిషనర్ చేస్తున్న ప్రయత్నాలు ఫలించడం లేదు. తాగు నీటి సరఫరా అస్తవ్యస్తంగా మారుతోంది. లీకులతో అవస్థలు పడుతున్నారు. అందుకు కారణాలు గుర్తించి కొన్ని చర్యలు చేపట్టారు. నగరపాలక సంస్థ పరిధిలో పలు రిజర్వాయర్లు, వాటర్ ట్యాంకుల్లో వర్క్ ఇన్‌స్పెక్టర్లు దశాబ్దాల తరబడి పాతుకుపోయారు. వీరంతా బినామీ కాంట్రాక్టర్ల అవతారమెత్తి వర్కులు చేసుకుంటున్నారనే ఆరోపణలపై కమిషనర్ వారికి అంతర్గత బదిలీలు చేపట్టాలని గత నెల రోజుల క్రితం చెప్పిన ఇంత వరకు ఎటువంటి స్పందన లేదు. ఏఈలు వర్క్ ఇన్‌స్పెక్టర్ల చెప్పిందే వేదంగా ఉండటంతో పాటు... అధికారులకు పర్సంటేజీలు తీసుకువచ్చేది వర్క్ ఇన్‌స్పెక్టర్లే కావడంతో వీరిని బదిలీ చేస్తే ఎక్కడ తమ ఆదాయానికి గండి పడుతుందో అని వీరిని బదిలీ చేయనీయకుండా ఎమ్మెల్యేల ద్వారా సిఫార్సులు చేయించుకుంటున్నారనే ఆరోపణలున్నాయి.

పారిశుద్ధ్య కార్మికుల రేషనలైజేషన్..


హెల్త్ ఆఫీసర్‌తో చర్చిస్తున్న కమిషనర్

నగరంలో ఆశించిన స్థాయిలో శానిటేషన్ జరగడం లేదని... వర్కర్లను రేషనలైజేషన్ చేయాలని కమిషనర్ ప్రజారోగ్యధికారులను ఆదేశించారు. నగరంలో శానిటేషన్ విభాగంలో వర్కర్‌గా చేరి... ఆ తరువాత డెప్యూటేషన్‌పై వివిధ విభాగాల్లో పనిచేస్తున్న వారిని తిరిగి వర్కర్లుగా తీసుకోవాలని నెల రోజుల క్రితం చెప్పినా ఇంత వరకు ఒక కొలిక్కి రాలేదు.

రోడ్డు విస్తరణ చేసిన తరువాత...

నగరంలోని పలు ప్రధాన ప్రాంతాల్లో కాలువలు, డ్రెయిన్లను ఆసరాగా చేసుకుని వ్యాపారం చేసుకుంటున్న వారిని తొలగించి రోడ్డు విస్తరణ చేయాలని కమిషనర్ పట్టణ ప్రణాళిక అధికారులను ఆదేశించారు. అయితే రోడ్డు వైడ్నింగ్(విస్తరణ) చేపట్టిన తరువాత తిరిగి అక్కడ వ్యాపారాలు నిర్వహించకుండా నిత్యం పర్యవేక్షణ చేయాలని అధికారులను ఆదేశించినప్పటికీ తిరిగి యథాస్థితిలో రోడ్డు, డ్రెయిన్‌ను ఆక్రమించుకుని వ్యాపారాలు నిర్వహించుకుంటున్నారు.

లీకులకు మరమ్మతులు చేపట్టడంలో..



నగర పరిధిలో పైపులైన్ లీకులను ఎప్పటికప్పుడు గుర్తించి వాటికి వెంటనే లీకు మరమ్మతులు చేపట్టాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించిన ఉపయోగం లేకుండా పోయింది. లీకు పడిన తరువాత దానిని సకాలంలో గుర్తించకపోవడంతో అది పెద్దదై...దానికి మరమ్మతులు చేపట్టానికి నగరం అంతా తాగునీటి సరఫరా ఆపివేసి మరి లీకు మరమ్మతులు చేపట్టాల్సిన దుస్థితి నెలకొంది.

ఏఈని సస్పెండ్ చేయాలని..

ప్రభుత్వం నిర్దేశించిన పనిని సక్రమంగా నిర్వహించడంలో విఫలం చెందిన ఓ ఏఈని సస్పెండ్ చేయాలని కమిషనర్, సంబంధింత అధికారిని ఆదేశించారు. అయితే సదరు ఏఈని సస్పెండ్ కానివ్వకుండా ఇంజినీరింగ్ అధికారులు అడ్డుపడుతున్నట్లు సమాచారం. దీంతో పాటు ఎమ్మెల్యేలతో సిఫార్సులు చేయించారనే ఆరోపణలతో ఆ సస్పెన్షన్ ఊసే ఎక్కడ వినిపించడం లేదని చెబుతున్నారు.



అర్జీలు రీ ఓపెన్ కాకుండా చూడాలి

కమిషనర్ పులి శ్రీనివాసులు

నెహ్రూనగర్: గుంటూరు నగరంలో స్థానిక సమస్యల పరిష్కారం కోసం నగరపాలక సంస్థలో చేపట్టే డయల్ యువర్ కమిషనర్, పీజీఆర్ఎస్‌లో ప్రజలు ఇస్తున్న అర్జీలు రీ ఓపెన్ కాకుండా సమగ్రంగా పరిశీలించి, శాశ్వత పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని గుంటూరు నగరపాలక సంస్థ కమిషనర్ పులి శ్రీనివాసులు స్పష్టం చేశారు. సోమవారం నగరపాలక సంస్థ కమిషనర్ చాంబర్‌లో డయల్ యువర్ కమిషనర్, కౌన్సిల్ హాల్‌లో పీజీఆర్ఎస్ నిర్వహించారు. తొలుత డయల్ యువర్ కమిషనర్ ద్వారా ప్రజల నుంచి అందిన 23 ఫిర్యాదులు తీసుకొని, అధికారులతో మాట్లాడుతూ ప్రజల నుంచి అందే అర్జీల్లో తక్షణం పరిష్కారం చేయగలిగినవి, కొంత సమయం తర్వాత చేయగలిగినవి వేరువేరుగా లిస్టు తయారు చేయాలని కోరారు. డయల్ యువర్ కమిషనర్‌కి అందిన అర్జీల పరిష్కారానికి విభాగాధిపతులే క్షేత్ర స్థాయి పరిశీలనకు వెళ్లాలని చెప్పారు. అనంతరం కౌన్సిల్ సమావేశ మందిరంలో పీజీఆర్ఎస్ కార్యక్రమం ద్వారా ప్రజల నుంచి అర్జీలు తీసుకొని అధికారులతో మాట్లాడుతూ పీజీఆర్ఎస్‌లో ప్రజలు ఇస్తున్న అర్జీలను సమగ్రంగా పరిష్కారం చేయాలని, ఆయా అర్జీలను ర్యాండమ్‌గా క్షేత్ర స్థాయి పరిశీలన చేస్తామన్నారు. క్షేత్ర స్థాయి అధికారులు అర్జీలను నేరుగా వెళ్లి పరిశీలించి పరిష్కారానికి కృషి చేయాలన్నారు. పారిశుద్ధ్యం, తాగునీటి సరఫరా, రోడ్ల ఆక్రమణ వంటి సమస్యల పరిష్కారం కోసం ప్రజలు జీఎంసి కార్యాలయానికి వస్తున్నారని, అవి స్థానికంగానే పరిష్కారం చేయాలన్నారు. ప్రజల నుండి అందే అర్జీలు, ఫిర్యాదుల నమోదుకి ప్రతి విభాగంలో ప్రత్యేకంగా రిజిస్టర్ ఏర్పాటు చేయాలన్నారు. పరిష్కారం అనంతరం ఫిర్యాదికి సమాచారం తెలియచేయాలన్నారు. సోమవారం నిర్వహించిన పిజిఆర్ఎస్ కు 47 ఫిర్యాదులు అందాయని వాటిలో పట్టణ ప్రణాళిక విభాగానికి 19, ఇంజినీరింగ్ విభాగానికి 14, రెవెన్యూ విభాగానికి 8, ప్రజారోగ్య విభాగానికి 1, అకౌంట్స్ విభాగానికి 3, ఉపా సెల్ విభాగానికి 2 చొప్పున ఫిర్యాదులు అందాయని, వాటిని నిర్దేశిత గడువులోగా పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అదనపు కమిషనర్ సిహెచ్.ఓబులేసు, డిప్యూటీ కమిషనర్లు డి.శ్రీనివాసరావు, సిహెచ్.శ్రీనివాస్, ఎస్.ఈ. నాగమల్లేశ్వరరావు, సిఎంఓహెచ్ డాక్టర్ శోభారాణి, ఎంహెచ్ఓ డాక్టర్ రవిబాబు, సిటి ప్లానర్ రాంబాబు, మేనేజర్ బాలాజీ బాష తదితరులు పాల్గొన్నారు.


ప్రజల నుంచి ఫిర్యాదుల స్వీకరిస్తున్న కమిషనర్

రోడ్లు ప్రణాళికాబద్ధంగా నిర్మించాలి

నెహ్రూనగర్: నగరపాలక సంస్థ పరిధిలో నూతన రోడ్లను డ్రెయిన్ టు డ్రెయిన్ ఏర్పాటు చేసేలా ప్రతిపాదనలు సిద్ధం చేయాలని, డ్రెయిన్ కల్వర్ట్‌పై తప్పనిసరిగా మ్యాన్ హోల్ ఏర్పాటు చేయాలని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు, ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. సోమవారం కమిషనర్ బృందావన్ గార్డెన్స్, విజయపురి కాలనీ, నవభారత్ నగర్, వికాస్ నగర్, ఎల్ఆర్ కాలనీ, వాసవీ నగర్ ప్రాంతాల్లో పర్యటించారు. కమిషనర్ మాట్లాడుతూ రోడ్లు, డ్రెయిన్ల నిర్మాణం అనంతరం డెబ్రిస్‌ని తొలగించాలని, సచివాలయాల వారిగా ఎక్కడైనా రోడ్లు ప్యాచ్ వర్క్ చేయాలని గుర్తిస్తే ఎప్పటికప్పుడు చేపట్టాలని ఎమినిటి కార్యదర్శులను ఆదేశించారు. అన్నమయ్య చెరువులో రిటైనింగ్ వాల్ నిర్మాణం, వాకింగ్ ట్రాక్ వెంబడి ఔషధ మొక్కలను నాటించాలని సూచించారు. నవభారత్ నగర్ 2వ లైన్ పరిశీలించి పారిశుద్ధ్య పనులను క్రమ పద్ధతిలో చేయాలని, ఉదయం ఇంటింటి చెత్త సేకరణ, మధ్యాహ్నం డ్రెయిన్ల శుభ్రం, అవసరమైన ప్రాంతాల్లో గ్యాంగ్ వర్క్ చేపట్టడం ద్వారా మెరుగైన పారిశుద్ధ్యం సాధ్యమవుతుందని పేర్కొన్నారు. పర్యటనలో డీఈఈ రమేష్ బాబు, ఎస్ఎస్ సోమశేఖర్, ఏఈలు చైతన్య, రవి కిరణ్ పాల్గొన్నారు.

నర్సింగ్ సేవలు చాలా కీలకం

- జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ రమణ
- గుంటూరు జీజీహెచ్‌లో సెమీ క్రిస్మస్ వేడుకలు

గుంటూరు మెడికల్: గుంటూరు జీజీహెచ్‌లో నర్సింగ్ సిబ్బంది చేసే సేవలు చాలా ముఖ్యమైనవని ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ యశస్వి రమణ అన్నారు. సోమవారం ఆస్పత్రిలోని శుశృత హాలులో నర్సింగ్ సిబ్బంది, నర్సింగ్ యూనియన్ ఆధ్వర్యంలో సెమీ క్రిస్మస్ వేడుకలు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ జీజీహెచ్‌లో పేద రోగులు వ్యాధి నుంచి కోలుకుని చిరునవ్వుతో వారి కుటుంబ సభ్యులను చేరుకునేలా చేయడంలో నర్సులు చాలా కీలక పాత్ర పోషిస్తున్నారని చెప్పారు. ఎంబీబీఎస్ పూర్తి కాగానే వైజాగ్‌లో క్రిస్టియన్ మిషనరీ స్కూల్‌లో పనిచేశానని, డాక్టర్‌గా తన జీవితం ప్రారంభమైన క్రిస్టియన్ మిషనరీలో జీవితంలో రాణించాల్సిన మెలకువలు నేర్చుకున్నట్లు వెల్లడించారు. తిరుపతి బర్డ్స్ హాస్పిటల్‌లో, చిలకలూరిపేట ఏఎంజీ సంస్థలో రోగులకు సేవలందించానని, అది తన జీవితంలో బాగా గుర్తుండిపోయే విషయమన్నారు. హాస్పిటల్ అడ్మినిస్ట్రేటర్ బి.ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ మానవ సేవే మాధవ సేవ అన్నట్లుగా రోగులకు నర్సింగ్ సిబ్బంది సేవలందిస్తారని, వారి సేవలు ఎంతో విలువైనవని కొనియాడారు. పలువురు నర్సింగ్ సిబ్బంది క్రిస్మస్ గీతాలను ఆలపించారు. పాస్టర్ డేనియల్ మోదీ క్రిస్మస్ సందేశాన్ని బైబిల్ ప్రవచనం ద్వారా అందించారు. క్యాండిల్ లైట్ సర్వీస్ నిర్వహించారు. నర్సింగ్ సూపరింటెండెంట్ గ్రేడ్-1 గంగ, నర్సింగ్ సూపరింటెండెంట్‌లు గ్రేడ్-2 కిరణ్మయి, ఆవుల విజయ, నాంచారమ్మ, రమాదేవి, జయలలిత, పద్మ, నర్సుల సంఘం నేతలు వెల్లంపల్లి పద్మజ, హేమలత, ఆషాలత, సునీత, శ్రీదేవి, భూలక్ష్మి, సుధారాణి, అరుణ పాల్గొన్నారు.


కేక్ కట్ చేస్తున్న డాక్టర్ యశస్వి రమణ

మహిళపై పెట్రోల్ పోసిన ఘటనపై కేసు

లక్ష్మీపురం: ఓ మహిళ ఆర్థిక అవసరాలకు డబ్బు అప్పుగా ఇచ్చి తిరిగి అడిగేందుకు ఇంటికి వెళ్లడంతో ఆమెపై పెట్రోల్ పోసి నిప్పు అంటించి హత్యాయత్నానికి పాల్పడిన ఘటన సోమవారం చోటు చేసుకుంది. అరండల్‌పేట పోలీసులు తెలిపిన వివరాలు.. ఎస్.టి.ఆర్. కాలనీకి చెందిన జరుపల ప్రమీల అనే మహిళ ముత్యాలరెడ్డినగర్ ప్రాంతానికి చెందిన లక్ష్మికి లక్ష రూపాయాలు ఆర్థిక అవసరాలకు అప్పుగా ఇచ్చింది. చాలా కాలంగా అదిగో ఇదిగో అంటున్న క్రమంలో ప్రమీల సోమవారం ముత్యాలరెడ్డి నగర్‌లో ఉంటున్న లక్ష్మి ఇంటి వద్దకు వెళ్ళి డబ్బులు ఇవ్వాల్సిందిగా కోరింది. దీంతో లక్ష్మి, ఆమెతో పాటు ఉన్న నాగేశ్వరరావుతో కలసి మా ఇంటికి వచ్చి డబ్బులు అడుగుతావా అని ప్రమీలపై పెట్రోల్ పోసి హత్యాయత్నానికి పాల్పడ్డారు. స్థానికులు గమనించి మంటలను అదుపు చేసి ప్రభుత్వ సమగ్రాస్పత్రికి తరలించారు. సమాచారం తెలుసుకున్న అరండల్‌పేట పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గంజాయి విక్రేతల అరెస్ట్

లక్ష్మీపురం: పలు కేసుల్లో నిందితుడిగా ఉంటూ అరండల్‌పేట పోలీస్ స్టేషన్‌లో రౌడీషీటర్‌గా ఉన్న వ్యక్తితో పాటు మరొకరు గంజాయి విక్రయిస్తున్నట్లు పోలీసులకు వచ్చిన సమాచారం మేరకు అదుపులో తీసుకుని కేసు నమోదు చేసిన ఘటన సోమవారం చోటు చేసుకుంది. అరండల్‌పేట పోలీసులు తెలిపిన వివరాలు.. వసంతరాయపురం ప్రాంతానికి చెందిన రౌడీషీటర్ చిలకా రాజకుమార్, డొంకరోడ్డు ప్రాంతానికి చెందిన కొత్తపు రత్నంరాజు అనే వారు ఆ పరిసర ప్రాంతాల్లో గంజాయి విక్రయిస్తున్నట్లు అరండల్‌పేట పోలీసులకు సమాచారం వచ్చింది. సమాచారం తెలుసుకున్న పోలీసులు వారిద్దరిని అదుపులో తీసుకుని వీరి వద్ద ఉన్న 120 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకుని స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేసి అరెస్ట్ చేశారు.

స్మార్ట్ మీటర్లు బిగించడాన్ని అడ్డుకున్న సీపీఎం నాయకులు

లక్ష్మీపురం: ప్రజలపై అదనపు భారాలు మోపే విద్యుత్ స్మార్ట్ మీటర్లు బిగించటాన్ని అడ్డుకోవాలని సీపీఎం నగర కార్యదర్శివర్గ సభ్యులు బి.ముత్యాలరావు పిలుపునిచ్చారు. సోమవారం గుంటూరు నగరం 41వ డివిజన్‌లోని పుచ్చలపల్లి సుందరయ్య నగర్‌లో నివాస గృహాలకు స్మార్ట్(ప్రీ పెయిడ్) మీటర్లు బిగించడానికి వచ్చిన విద్యుత్ శాఖ సిబ్బందిని సీపీఎం నాయకులు అడ్డుకున్నారు. ఆయన మాట్లాడుతూ ట్రూ అప్ చార్జీలు, విద్యుత్ సుంకం, ఇంధన సర్దుబాటు చార్జీలు పేరుతో ఇప్పటికే ప్రజలపై భారాలను మోపి వసూలు చేస్తున్నారని అన్నారు. ఇవి చాలదన్నట్టు తెలుగుదేశం కూటమి ప్రభుత్వం స్మార్ట్(ప్రీపెయిడ్) మీటర్లు బలవంతంగా ఇళ్లకు బిగించాలని చూస్తుందని విమర్శించారు. అధికారంలోకి వచ్చిన తర్వాత అదానీతో చేసుకున్న ఒప్పందాలను కొనసాగిస్తూ ప్రీపెయిడ్ మీటర్లు బిగించడం అంటే ప్రజలపై భారం మోపటమే అన్నారు. ఈ స్మార్ట్ (ప్రీపెయిడ్) మీటర్లు బిగించితే ఒక్కో మీటర్ కు 10 నుంచి 15 వేల రూపాయలు ప్రజలపై అదనంగా భారం పడుతుందన్నారు. ఈ స్మార్ట్ ప్రీపెయిడ్ మీటర్లు బిగించడం ద్వారా ప్రజలకు ఒరిగేది ఏమీ లేదని ప్రధాని లాంటి వారికి ప్రజల సొమ్మును దోచిపెట్టడమేనని విమర్శించారు. తెలుగుదేశం కూటమి ప్రభుత్వం వచ్చిన ఆరు నెలల్లోనే వేల కోట్ల రూపాయలు ప్రజలపై భారాలు వేస్తుందని విమర్శించారు. పోరాటంలో ప్రజలు భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సీపీఎం నగర కమిటీ సభ్యులు షేక్ ఖాశిం షహీద్, పుచ్చలపల్లి సుందరయ్య నగర్ శాఖ కార్యదర్శి గోనే లూథర్‌పాల్, నాయకులు ఆది నికల్సన్, షేక్ మస్తాన్ వలి, కె.ఆంజనేయులు, కె.ఏడుకొండలు, ప్రభుదాసు, పాదిలి ఆది బాబు పాల్గొన్నారు.


విద్యుత్ స్మార్ట్ మీటర్లు బిగించడానికి వచ్చిన సిబ్బందిని అడ్డుకున్న సీపీఎం నాయకులు

చిత్రలేఖనంలో సత్తా చాటిన బాలలు


జాతీయస్థాయి చిత్రలేఖన పోటీల్లో సత్తా చాటిన విద్యార్థులతో చంద్రశేఖర్‌రెడ్డి

గుంటూరు ఎడ్యుకేషన్: గుజరాత్‌కు చెందిన రెయిన్‌బో ఆర్ట్స్ అకాడమీ గత నెలలో నిర్వహించిన జాతీయ స్థాయి చిత్రలేఖన పోటీల్లో సుమేధ హైస్కూల్ విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ చూపినట్లు పాఠశాల డైరెక్టర్ మున్నంగి చంద్రశేఖర్ రెడ్డి తెలిపారు. ఎన్జీవో కాలనీలోని సుమేధ హైస్కూల్లో సోమవారం అభినందన కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ చిత్రలేఖనంలో నైపుణ్యవంతులుగా నిలిచిన తమ విద్యార్థులు అత్యధికంగా 31 బంగారు పతకాలతో పాటు 34 రజత, ఎనిమిది కాంస్య, ఏడు ఉత్తమ ప్రతిభా పతకాలతో మొత్తం 80 పతకాలను కైవసం చేసుకున్నారని వివరించారు. అత్యధిక స్థాయిలో పతకాలు సాధించడంతో పాటు పాఠశాల డైరెక్టర్ మున్నంగి చంద్రశేఖర్ రెడ్డిని కళారత్న అవార్డుతో సత్కరించారు.

యాజమాన్య పద్ధతులపై రైతులకు అవగాహన

గుంటూరు రూరల్: రబీ పంటల్లో రైతులు చేపట్టాల్సిన యాజమాన్య పద్ధతులపై రైతు అవగాహన సదస్సును బాపట్ల వ్యవసాయ కళాశాల ఆధ్వర్యంలో నిర్వహించారు. నిడుముక్కల గ్రామంలో సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో గ్రామంలోని రైతులతో కలిసి వ్యవసాయ సమస్యలు వాటి పరిష్కారాలపై చర్చించారు. రబీ పంట కాలంలో చేట్టాల్సిన యాజమాన్య పద్ధతులు, అపరాల సాగులో వచ్చే చీడపీడలు, వాటి నిర్మూలనకు చేపట్టాల్సిన యాజమాన్య పద్ధతులు తెలిపారు. కార్యక్రమంలో రైతులు గ్రామ ప్రజలు, వ్యవసాయ కళాశాల విద్యార్థినులు పాల్గొన్నారు.



21న వినియోగదారుల దినోత్సవంపై పోటీలు

గుంటూరు ఎడ్యుకేషన్: ఈనెల 24న జాతీయ వినియోగదారుల దినోత్సవాన్ని పురస్కరించుకుని గుంటూరు జిల్లాలో అన్ని యాజమాన్యాల్లోని ఉన్నత పాఠశాలల విద్యార్థులకు ఈనెల 21న వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించనున్నట్లు జిల్లా విద్యాశాఖాధికారి సీవీ రేణుక సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. 'వినియోగదారుల న్యాయపాలనకు వర్చువల్ విచారణలు-డిజిటల్ సౌలభ్యం' అనే అంశంపై గుంటూరు పాత బస్టాండ్ సెంటర్‌లోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో పోటీలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. తెలుగు, ఆంగ్ల, ఉర్దూ భాషల్లో నిర్వహిస్తామని తెలిపారు. విజేతలకు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతుల రూపంలో వరసగా రూ.మూడు వేలు, రూ.రెండు వేలు, రూ.1,500 చొప్పున నగదు బహుమతులు అందజేస్తామని పేర్కొన్నారు. ఎస్ఏ-1 పరీక్షల కారణంగా గతంలో ఇచ్చిన షెడ్యూల్ కాకుండా ఈనెల 21న ఉదయం 10 గంటలకు అన్ని యాజమాన్యాల్లోని చదువుతూ, పోటీల్లో పాల్గొనే ఆసక్తి గల విద్యార్థులను పంపాలని సూచించారు.

వివాహిత ఆత్మహత్య

లక్ష్మీపురం: భర్త వేధింపులతో ఈనెల 8వ తేదీన ఎలుకల మందు తాగి ఆత్మహత్య చేసుకున్న మహిళ చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందింది. పట్టాభిపురం పోలీసులు తెలిపిన వివరాలు.. కొబాల్డ్‌పేట 3వ లైన్‌కు చెందిన ఆరేపల్లి మాధవి(26) తల్లి దండ్రులు మృతి చెందినప్పటి నుంచి అమ్మమ్మ మరియమ్మ వద్దనే ఉంటుంది. 2013లో ఆరేపల్లి ఈశ్వరబాబుతో పెద్దలు కుదిర్చిన వివాహం జరిగింది. వీరువురికి ఇద్దరు మగ సంతానం ఉన్నారు. భర్త చెడు వ్యసనాలకు అలవాటు పడి ఆరేపల్లి మాధవిని నిత్యం మద్యం తాగి వేధిస్తూ నివాస గృహంలో ఉన్న వస్తువులు కూడా అమ్ముకున్నాడు. దీంతో మాధవి భర్త వేధింపులు భరించలేక ఈనెల 8వ తేదీన పట్టాభిపురంలోని ఎలుకల మందు తాగి ఆత్మహత్య చేసుకుంది. దీంతో స్థానికులు గమనించి ప్రభుత్వ సమగ్రాస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మాధవి ఆదివారం అర్ధరాత్రి మృతి చెందింది. దీంతో పోలీసులకు సమాచారం రావడంతో మృతురాలి వివరాలు సేకరించారు. మృతురాలి సోదరి సంధ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు భర్త ఆరేపల్లి ఈశ్వరబాబుపై కేసు నమోదు చేశారు.

ఇంటింటికి శ్రీరామాయణం పుస్తకాలు పంపిణీ

నగరంపాలెం: శ్రీరామాయణం గ్రంథం ప్రచారంలో భాగంగా సోమవారం శ్రీనివాసరావుతోట, నల్లచెరువు, ఆర్.అగ్రహారం, సంపత్‌నగర్‌లోని ఇంటింటికి తిరిగి పంపిణీ చేశారు. ఈనెల 17న ఆర్ అగ్రహారం రామానామక్షేత్రం ఆవరణలో నిర్వహించనున్న 98వ శ్రీరామకోటి ఉత్సవాల్లో భాగంగా భారతీయ మార్గం పూర్వ ప్రధాన సంపాదకులు, డాక్టర్ పులిచెర్ల సాంబశివరావు రచించిన శ్రీరామాయణం పుస్తకాలను భక్తుల సౌకర్యార్థం దుకాణాల్లో అందుబాటులో ఉంచామని బీజేపీ ధార్మిక సెల్ జిల్లా కన్వీనర్ కావేరి మధు అన్నారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఈదర శ్రీనివాసరెడ్డి, కొక్కెర శ్రీనివాస్‌యాదవ్, పులిచెర్ల దేవకాంత్, భారతి, కపిలవాయి బదరీ నారాయణ, సాయిరాధాకృష్ణ, కోనేటి గోవింద్ పాల్గొన్నారు.

పచ్చదనం.. పరిశుభ్రతకు ప్రాధాన్యం

ఎంపీపీ పద్మలీల

పొన్నూరు: మండలంలోని గ్రామాల్లో పచ్చదనం .. పరిశుభ్రతకు ప్రాధాన్యమిచ్చి ఆదర్శవంతమైన గ్రామాలుగా తీర్చిదిద్దాలని ఎంపీపీ భవనం పద్మలీల అన్నారు. సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో సుస్థిరాభివృద్ధి లక్ష్యాలు స్థానికీకరణ ఆవశ్యకతపై మండల స్థాయి శిక్షణ తరగతులు సోమవారం ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ఆరోగ్యం, సమృద్ధిగా నీరు, మౌలిక సదుపాయాల కల్పన తదితర అంశాలపై అధికారులు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ చంద్రశేఖర్, విస్తరణాధికారి కేఎస్ మల్లికార్జునరావు, ఏఓ డి.డి.వి.నారాయణరావు, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ నాగేశ్వరరావు, సీడీపీఓ వెంకటరమణ, ఎంఈఓ శ్రీనివాసరెడ్డి, ఎంపీహెచ్ఓ వేణు, కార్యదర్శులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

తిరుప్పావై ఆధ్యాత్మిక ప్రవచనాలు ప్రారంభం



నగరంపాలెం: స్థానిక బృందావన్‌గార్డెన్స్ శ్రీవేంకటేశ్వరస్వామి దేవాలయంలో టీటీడీ ఆళ్వార్ దివ్య ప్రబంధ ప్రాజెక్ట్ ఆధ్వర్యంలో ధనుర్మాసం సందర్భంగా సోమవారం తిరుప్పావై పై ఆధ్యాత్మిక ప్రవచనం నిర్వహించారు. ఆలయ కమిటీ అధ్యక్షులు సీహెచ్ మస్తానయ్య, సహాయ కార్యదర్శి ఊటుకూరి నాగేశ్వరరావు జ్యోతిప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఉదయం గోదా అమ్మవారి మూలవిరాట్‌కు వివిధ రకాల ఫలరసాలతో, పంచామృతాలతో అభిషేకం, ప్రత్యేక పూజలు, అలంకరణ జరిగాయి. సాయంత్రం ప్రముఖ ఆధ్యాత్మికవేత్త డాక్టర్ కె.వి.రంగనాయకి తిరుప్పావై పై ప్రవచనం చేశారు. ధనుర్మాస విశిష్టత, కాత్యాయిని వ్రతం విశిష్టత, గోదాదేవి అమ్మవారి ఆవిర్భావం తదితర వాటిపై వివరించారు.

డాన్స్ అకాడమీ ధ్రువీకరణ పత్రాలు అందజేత



నగరంపాలెం: గత నెల 24న అన్నమయ్య డాన్స్ అకాడమీ (తిరుపతి) ఆధ్వర్యంలో నిరంతర కోలాటం పది నిమిషాల పాటు శ్రీవెంకటేశ్వర విశ్వవిద్యాలయంలో నిర్వహించారు. గుంటూరుకు చెందిన శ్రీ వెంకటేశ్వర కోలాట భజన మండలి నుంచి 29 మంది కోలాట మహిళలు హాజరయ్యారు. సుమారు 2024 మందితో 2024 సంవత్సరంలో పది నిమిషాలు బ్రహ్మమొక్కటే పరబ్రహ్మమొక్కటే అన్నమయ్యాచార్య కీర్తనకు నిర్విరామంగా కోలాటం చేశారు. దీనికిగాను ఇంటర్నేషనల్ వండర్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డును సాధించారు. ఈ మేరకు ధ్రువీకరణ పత్రాలతో తిరుపతి అన్నమయ్య అకాడమీ ప్రిన్సిపాల్ శ్రీరామమూర్తి సోమవారం గుంటూరు విచ్చేసి, నక్క పద్మశ్రీకి అందించారు. అనంతరం కోలాటంలో పాల్గొన్న బృంద సభ్యులకు ధ్రువీకరణ పత్రాలను పంపిణీ చేశారు.

డాక్టర్ రమణకు వైద్యభూషణ్ జాతీయ పురస్కారం



నగరంపాలెం: గుంటూరు నగరానికి చెందిన ప్రముఖ హోమియో వైద్యులు టీవీ రమణ వైద్య భూషణ్ జాతీయ పురస్కారాన్ని అందుకున్నారు. ఆదివారం రాత్రి హైదరాబాద్‌లో ఆల్ ది బెస్ట్ ఆర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రదానోత్సవంలో ఆయన్ను సత్కరించి, అవార్డు ప్రదానం చేశారు. తెలంగాణ రాష్ట్ర మానవ హక్కుల కమిషన్ చైర్‌పర్సన్ జస్టిస్ చంద్రయ్య, కేంద్ర ఫిలిం సెన్సార్ బోర్డు సభ్యులు పి.కృష్ణ ఆదిశేషు అందించారు. వైద్యసేవలో విస్తృతంగా సేవలు అందించారని అతిథులు అన్నారు. మానవసేవే మాధవ సేవ అనేరీతిలో ఆధ్యాత్మిక సేవతోపాటు వృద్ధాశ్రమం, అనాథ శరణాలయం, గోశాలలు ఏర్పాటు వంటి చేస్తున్నారని కొనియాడారు.

అథ్లెటిక్స్‌లో ఏసీ కళాశాల విద్యార్థులకు పతకాలు



గుంటూరు ఎడ్యుకేషన్: ఏఎన్‌యూలో ఈనెల 13,14,15వ తేదీల్లో నిర్వహించిన అంతర్ కళాశాలల అథ్లెటిక్స్ మీట్‌లో ఏసీ కళాశాల క్రీడాకారుల బృందం పతకాలు కైవసం చేసుకున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.మోజెస్ తెలిపారు. సాంబశివపేటలోని ఏసీ కళాశాలలో సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో మోజెస్ మాట్లాడుతూ బీఏ ద్వితీయ సంవత్సర విద్యార్థి సీహెచ్ ఆదినారాయణ డెకాథ్లాన్, లాంగ్ జంప్, బీఏ తృతీయ సంవత్సర విద్యార్థి ఎ.ప్రేమ్‌చంద్ వెయ్యి మీటర్లు, ఐదు వేల మీటర్ల పరుగులో బంగారు పతకాన్ని కైవసం చేసుకున్నట్లు వివరించారు. ఎంఏ ఇంగ్లిష్ ప్రథమ సంవత్సర విద్యార్థి భాను 400 మీటర్ల పరుగు, బీఏ తృతీయ సంవత్సర విద్యార్థి పి.నాని 100 మీటర్ల పరుగులో కాంస్య పతకాలు పొందారని వివరించారు. ఈసందర్భంగా విద్యార్థులను ప్రిన్సిపాల్ మోజెస్‌తో పాటు ఫిజికల్ ఎడ్యుకేషన్ విభాగాధిపతి డాక్టర్ జీపీ ప్రీతమ్ ప్రకాష్ అభినందించారు